పేదలను ఏడిపింఛెన్

- కొత్త పింఛన్ కోసం పేదల ఎదురుచూపులు
- స్పష్టమైన ప్రకటన చేయని కూటమి ప్రభుత్వం
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే అందజేస్తామని హామీ
- ఇంత వరకు ఓపెన్ కాని వెబ్‌సైట్


ఎంపీడీఓ కార్యాలయం

బనగానపల్లె రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఐదు నెలలవుతోంది. ఇంత వరకు కొత్త పింఛన్లపై స్పష్టమైన ప్రకటన చేయలేదు. అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. పింఛన్లు మంజూరు చేయాలని ఎంపీడీఓ కార్యాలయం, సచివాలయం, కూటమి నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు సంబంధం లేకుండా గ్రామ, వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే పింఛన్లు మంజూరయ్యేవి. కూటమి ప్రభుత్వం పింఛన్ల మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు నిరీక్షణ తప్పడం లేదు.

తప్పని నిరీక్షణ

అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకు రోజూ పదుల సంఖ్యలో లబ్ధిదారులు వెళ్తున్నారు. నూతన పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఇప్పటి వరకు సంబంధిత వెబ్‌సైట్ తెరవకపోవడంతో అర్హులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి సమాచారం అందలేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఇలా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం నిత్యం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశముండేది. వలంటీర్లే ఇంటి వద్దకు వెళ్లి అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో దగ్గరుండి దరఖాస్తు చేయించేవారు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రతి ఆరు నెలలకోసారి లబ్ధిదారులను గుర్తించి మంజూరు చేసేవారు. ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగింది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం పింఛన్లు, రేషన్ కార్డు వెబ్‌సైట్‌ను పూర్తిగా నిలిపివేసింది. లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. బనగానపల్లె నియోజవర్గంలోని బనగానపల్లె, కోవెలకుంట్ల, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల మండలాల్లో వివిధ రకాల పింఛన్ లబ్ధిదారులు 36,967 మంది ఉన్నారు. కొత్తగా అర్హత ఉన్న వందలాది మంది ఎదురుచూస్తున్నారు.

50 ఏళ్లకే పింఛన్ అంటూ వంచన

తాము అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్లు అందజేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదు. నమ్మి ఓట్లు వేస్తే తమను పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్‌కోసం ఎదురు చూపులు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తోంది. ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం సరికాదు. ప్రస్తుతం నా వయస్సు 50 ఏళ్లు దాటింది. పింఛన్ వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నాను.

–సంటెన్న,నందివర్గం గ్రామం

హామీలను అమలు చేయాలి



సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ తర్వాత వాటిని విస్మరిస్తోంది. నమ్మి ఓట్లు వేసిన వారిని మోసం చేయడం భావ్యం కాదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 50 ఏళ్ల పైబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పింఛన్లు మంజూరు చేయాలి.

–సుబ్బయ్య,
సీపీఎం డివిజన్ కార్యదర్శి, బనగానపల్లె

కార్తీక మాసంలో ప్రత్యేక బస్సులు

కోవెలకుంట్ల: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో నుంచి వివిధ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో పంచశైవక్షేత్రాలైన కన్నెతీర్థం, నయనాలప్ప, ఓంకారం, మహానంది, యాగంటి క్షేత్రాలకు ప్రత్యేక బస్‌సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 18వ తేదీ, 25వ తేదీల్లో కోవెలకుంట్ల బస్టాండ్ నుంచి ఉదయం 6.30 గంటలకు బస్సులు బయలు దేరుతాయన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శైవక్షేత్రాలను సందర్శించాలని సూచించారు. ప్రత్యేక బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు.

15న వెర్రిగోవిందస్వామి ఆరాధనోత్సవాలు

కొలిమిగుండ్ల: తిమ్మనాయినపేటలో వెలసిన వెర్రిగోవిందస్వామి 267వ ఆరాధనోత్సవాలను ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం విశేష మంగళహారతి జరుగుతుందన్నారు. దాతల సహకారంతో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానుండడంతో ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

క్లుప్తంగా

బేతంచెర్లకు చేరుకున్న భక్తి చైతన్య యాత్ర


వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: కర్నూలు నుంచి తిరుమలకు చేపట్టిన భక్తి చైతన్య మహాపాదయాత్ర సోమవారం బేతంచెర్లకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానికులు, భక్తులు వారికి స్వాగతం పలికి, రథంపై ఉన్న వేంకటేశ్వస్వామికి పూజలు చేశారు. 13వ సారి పాదయాత్రగా తిరుమలకు వెళ్తున్నట్లు భక్తిచైతన్య పాదయాత్ర కమిటీ సభ్యులు తెలిపారు. నాగ మోహన్, గాజుల హరి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నియామకం


బాలుయాదవ్

కోవెలకుంట్ల: కాంగ్రెస్ పార్టీ బనగానపల్లె సమన్వయకర్తగా కోవెలకుంట్లకు చెందిన బాలుయాదవ్ నియమితులయ్యారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తిరిగి ఆయన్నే నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

సీఐగా బాధ్యతల స్వీకరణ


ప్రవీణ్‌కుమార్

బనగానపల్లె: పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐగా ప్రవీణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న కృష్ణయ్య నంద్యాల సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని నూతన సీఐ తెలిపారు.

తెలుగు ఘనత శతకం పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంస్కృతి విశ్వవిద్యాలయ వీసీ

డోన్: తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో తాను రచించిన తెలుగు ఘనత శతకం అనే గ్రంథాన్ని వీసీ ఆచార్య క్రిష్ణమూర్తి చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించినట్లు డోన్ మండలం గోసానిపల్లె ప్రభుత్వ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ అనుగోలు సంజీవరాయుడు తెలిపారు. డాక్టర్ చక్రవర్తి, తెలుగుశాఖ అధిపతి నల్లన్న, పరీక్ష విభాగం అధిపతి సాంబమూర్తి పాల్గొన్నారు.

దాడి చేశారని ఫిర్యాదు

డోన్ రూరల్: తనపై ఇద్దరు వ్యక్తులు దాడి చేశారని పట్టణంలోని సుందర్‌సింగ్‌కాలనీకి చెందిన రైల్వే ఉద్యోగి కె.విజయ్‌కృష్ణ సోమవారం డోన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. యూనియన్ ఎన్నికల ప్రచారం ముగించుకుని ఇంటికి వెళ్తుండగా గౌస్, హుసేన్ అనే యువకులు దాడి చేశారని పేర్కొన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏఐఎస్‌ఎఫ్ మహాసభలను జయప్రదం చేద్దాం

బేతంచెర్ల: నంద్యాలలో ఈనెల 14వ తేదీ జరగనున్న ఏఐఎస్ఎఫ్ మహా సభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ధనుంజయ కోరారు. సోమవారం పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. బేతంచెర్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు అనిల్, లక్ష్మణ్ నాయుడుతో పాటు 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. విద్యారంగ సమస్యలపై నిర్వహించే జిల్లా ప్రథమ సభలను విజయవంతం చేయాలని కోరారు.

స్విమ్మింగ్‌లో పతకాలు


విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్యాపిలి: పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ప్యాపిలి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐదు పతకాలు సాధించినట్లు హెచ్ఎం సరళాదేవి తెలిపారు. సోమవారం స్థానిక స్కూల్‌లో విజేతలను అభినందించారు. 68వ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల బాలబాలికల స్విమ్మింగ్ పోటీల్లో అండర్ 17 బాలికల విభాగంలో కె.వైశాలి 100 మీటర్స్, ఫ్రీ స్టైల్ 50 మీటర్స్ బ్యాక్ స్ట్రోక్‌లో రెండు బంగారు పతకాలు, ఎం.అర్చన 100 మీటర్స్ ఫ్రీస్టైల్‌లో కాంస్యం, బి.సురేఖ 50 మీటర్స్ బ్యాక్ స్ట్రోక్‌లో వెండి, 50 మీటర్స్ ఫ్రీస్టైల్‌లో కాంస్యం పతకాలు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మీతో పాటు విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందిజేసి అభినందనలు తెలిపారు.

మౌలానా సేవలు మరువలేనివి


డోన్: పాతపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివని పాతపేట జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పద్మావతి అన్నారు. సోమవారం మౌలానా జయంతి(జాతీయ విద్యా దినోత్సవం) సందర్భంగా పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యారంగానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని తెలిపారు. 14 ఏళ్లలోపు వారికి విద్యా హక్కు కల్పించి విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాట వేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, రఘునాథ్, వెంకటరమణ, వెంకటలక్ష్మి, రాధ, లక్ష్మీకాంతరెడ్డి, మధుసూదనరెడ్డి, సుభాన్, ఆదినారాయణ, అల్లీపీరా పాల్గొన్నారు. శ్రీవైష్ణవి డిగ్రీ కళాశాలలో సామాజిక కార్యకర్త మమ్మద్ రఫీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

అబుల్‌కలాం సేవలు చిరస్మరణీయం

బనగానపల్లెరూరల్: మౌలానా అబుల్‌కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని బనగానపల్లె కార్పెంటర్స్ యూనియన్ అధ్యక్షుడు చాంద్‌బాషా అన్నారు. స్థానిక కార్పెంటర్స్ కార్యాలయంలో ఆజాద్ జయంతిని పురస్కరించుకుని పలువురు విద్యార్థులకు జామెంట్రి బాక్స్‌లను పంపిణీ చేశారు. జుబేర్ మౌలానా, మహమ్మద్‌హుస్సేన్, ఖదర్‌బాషా పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

బేతంచెర్ల: దేశంలో విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని హెచ్ఎం మద్దిలేటి రెడ్డి అన్నారు. సోమవారం గోర్లగుట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో అబుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు శివ కుమార స్వామిని సత్కరించారు. ఉపాధ్యాయులు ఫర్హత్ జహాన్, నసీం, వరలక్ష్మీ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలి

ప్యాపిలి: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు శాంతిప్రియ పిలుపునిచ్చారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మౌలానా విద్యారంగం అభివృద్ధి కోసం చేసిన సేవలను కొనియాడారు. జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని.. బోధన రెండు మాధ్యమాల్లో సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం మౌలానా జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యుటీఎఫ్ నాయకులు రమేష్, ఇన్‌చార్జ్ హెచ్ఎం నందీశ్వరరెడ్డి, రాజేంద్ర, రమేష్, శేఖర్, మోహన్‌రావు, శ్రీకళ పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు శివ కుమారస్వామికి సత్కారం, మౌలానాకు నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

విధుల్లో అలసత్వం వహించొద్దు


మాట్లాడుతున్న ఎంపీడీఓ

బేతంచెర్ల: గ్రామ సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహించకుండా బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కమిషనర్ హరిప్రసాద్, ఈఓఆర్డీ మల్లికార్జునతో కలిసి గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హౌస్ హోల్డ్ జియో లొకేషన్ సర్వేను పగడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు అందాలంటే తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అలాగే హౌస్ హోల్డ్ జియో లొకేషన్ సర్వేకు అందరూ సహకరించాలన్నారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో కోడిపందెం ఆడుతున్నట్లు అందిన సమాచారంతో దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. కోడి పందెలు ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2900, 11 మొబైల్ ఫోన్లు, 18 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామని చెప్పారు. అలాగే 4 పందెం కోళ్లు, 4 కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. 14 మందిపై కేసు నమోదు చేయగా మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

రోగులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న వైద్యురాలు, లయన్స్ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని.. ఆస్పత్రిలోని రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేయడం అభినందనీయమని అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యురాలు ప్రయాంక అన్నారు. సోమవారం పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో రోగులు, గర్భిణులు, వృద్ధులకు లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి, రాజు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు సాంబశివారెడ్డి, వలిబాషా, మనోహర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న అర్బన్ హెల్త్ సెంటర్

సాక్షి ఎఫెక్ట్


వైద్యం కోసం వచ్చిన రోగులు

బేతంచెర్ల: నగర పంచాయతీ పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో రూ.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఎట్టకేలకు వినియోగంలోకి తెచ్చారు. కేంద్రాన్ని ప్రారంభించి 9 నెలలు అవుతున్నా నిరుపయోగంగా ఉండడంపై గత నెల 27న సాక్షిలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. సోమవారం వైద్యురాలు గాయత్రి వైద్య సేవలను ప్రారంభించారు. అలాగే ఆస్పత్రి ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా కార్తీక మాస పూజలు


నేలబెలంలో అభిషేకం చేస్తున్న భక్తులు,


బేతంచెర్ల: భేతేశ్వర శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు,


అవుకు: బలరామేశ్వరస్వామి ఆలయంలో..

కోవెలకుంట్ల: కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా బనగానపల్లె నియోజకవర్గంలోని శివాలయాల్లో విశేష పూజలు చేశారు. కోవెలకుంట్ల గాంధీ సెంటర్‌లో వెలసిన శివాలయం, నాగలింగేశ్వర స్వామి, పాటిమీద శివాలయం, మారెమ్మ ఆలయం, ఏడుకొప్పెర్లబావి సమీపంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే భీమునిపాడు పద్మనాభస్వామి ఆశ్రమంలో వెలసిన పంచబ్రహ్మలింగేశ్వరస్వామి, గుళ్లదూర్తి, కలుగొట్ల, బిజనవేముల, రేవనూరు, సౌదరదిన్నె, తదితర గ్రామాల్లో కార్తీక పూజలు జరిగాయి. ఏడుకొప్పెర్ల బావి సమీపంలోని శివాలయం వద్ద మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

మార్మోగిన శివనామస్మరణ

కొలిమిగుండ్ల: మండలంలోని శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగిపోయాయి. తెల్లవారు జామునే ఆలయాలకు చేరుకుని శివునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కార్తీక స్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు. బందార్లపల్లె సమీపంలోని పురాతన నేలబెలుం మల్లేశ్వరస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పెద్దవెంతుర్లలో అశ్వర్థనారాయణస్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. పెట్నికోట సమీపంలోని గుండుమల్లేశ్వరస్వామి ఆలయం, బెలుం సిద్ధ రామేశ్వరస్వామి ఆలయంతో పలు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు విశేష పూజలు చేశారు.


కోవెలకుంట్ల: పంచముఖ సిద్ధేశ్వరస్వామి ఆలయం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు

బేతంచెర్ల: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శివాలయాల్లో విశేష పూజలు జరిగాయి. హెచ్.కొట్టాల సమీపంలోని ముచ్చట్ల మల్లికార్జునస్వామి, యంబాయి రామలింగేశ్వరుడు, బైనపల్లె, ముసలాయి చెర్వు, రహిమానుపురం గ్రామాల్లోని కాశీవిశాలాక్షి, విశ్వేరస్వామి, సిమెంట్‌నగర్‌లో వెలసిన జీవ బుగ్గ లింగేశ్వరస్వామి, గోర్లగుట్ట గ్రామంలోని బుగ్గరామేశ్వరస్వామి, పూడోట మఠంలోని భేతేశ్వర శివలింగం, దుర్గాపేటలోని సిద్ధేశ్వరస్వామి ఆలయాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.


విద్యుత్ దీపాలంకరణలో లలితా సుందరేశ్వరస్వామి ఆలయం

కిటకిటలాడిన శైవక్షేత్రాలు

అవుకు: మండల పరిధిలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అవుకులోని కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో మహిళలు దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పట్టణంలోని అగ్రహారం వీధిలోని బలరామేశ్వర స్వామి ఆలయంలో లింగాకారంలో శివుడిని, పక్కనే గణనాథుడు, త్రిశూల అలంకరణతో ప్రత్యేకంగా అలంకరించి చుట్టూ దీపాలను వెలిగించారు. అనంతరం భక్తులు స్వామివారి కీర్తనలతో స్మరించుకున్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామానికి చెందిన వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కటికల చిన్నబాబు ఆదివారం సాయంత్రం ఇంటికి వెళ్తుండగా భూమ నాగిరెడ్డి విగ్రహం వద్ద అదే గ్రామానికి చెందిన అందనం బాబు, అందనం రవి, చిన్ని, ప్రవీణ్, సిమోన్, పెద్ద సుబ్బయ్య అడ్డుకున్నారు. దాడి చేసి గాయపరిచారు. అతన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోమవారం బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

బనగానపల్లె రూరల్: ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక గ్రంథాలయ అధికారి బషీర్ అహమ్మద్ సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా 14న బాలల దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులకు సన్మానం, 17న కవి సమ్మేళనం-కవులకు సన్మానం, 18న విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, 19న మహిళా దినోత్సవం-మహిళా సాధికారతపై చర్చ, 20న పిల్లలకు బహుమతుల ప్రధానోత్సవంతో వారోత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు. పలువురు అధికారులను కలిసి వారోత్సవాలకు ఆహ్వానం పలికారు.

యాగంటిలో భక్తుల సందడి



యాగంటిలో స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు,నందీశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు

బనగానపల్లె రూరల్: ప్రముఖ శైవక్షేత్రం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, కుంకుమార్చన, సహస్రనామావళి, మధ్యాహ్నం మహానివేదన చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ముందుగా ఆలయ ఆవరణలోని పెద్ద పుష్కరిణిలో కార్తీక స్నానాలు చేశారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం ఏకశిలా రూపంలోని శివపార్వతులు, వినాయకుడు, నందిశ్వరులను దర్శించుకుని పూజలు చేశారు.

ఉమామహేశ్వరుని సేవలో మాజీ ఎమ్మెల్యేలు

బనగానపల్లె రూరల్: యాగంటి ఉమామహేశ్వర స్వామిని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్ర నాథ్‌రెడ్డి, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఉమామహేశ్వరమ్మ దంపతులు వేర్వేరుగా దర్శించుకున్నారు. పల్లకీ సేవలో పాల్గొన్నారు. వారికి ఆలయ ఈఓ చంద్రుడు, ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.


పల్లకీ మోస్తున్న ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి


యాగంటి పెద్ద పుష్కరిణిలో కార్తీక స్నానాలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతి

డోన్: నిరుద్యోగ యువతీయువకులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి రంగాలు, ప్రైవేటు రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని గుండా వెంకటరత్నం శెట్టి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతి అన్నారు. కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో కేఎల్ గ్రూప్, ముత్తూట్ ఫైనాన్స్, సెనిడైర్ ఎల్రక్టికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొన్నాయి. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాలో 65 మంది అభ్యర్థులు పాల్గొనగా 30 మంది ఉద్యోగ అర్హత సాధించారు. వీరందరికీ కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఏపీ ఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారి సుబ్బన్న, కళాశాల ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, జిల్లా ఉపాధి కల్పన అధికారులు నియామక పత్రాలను అందజేశారు.